క్లుప్తంగా

నేడు ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

కోదాడ : హైదరాబాద్‌కు చెందిన బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పేరున్న వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, కోదాడ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గరిడేపల్లి : కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గరిడేపల్లి మండల వైద్యాధికారి వి.నరేష్ కోరారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

పాలకవీడు : భక్తుల సౌకర్యార్థం శ్రీ భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాల పంపిణీకి ఆర్టీసీ బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు డెక్కన్ సిమెంట్ పరిశ్రమ మహిళా క్లబ్ అధ్యక్షురాలు నవీన తెలిపారు. గురువారం స్థానిక పరిశ్రమ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మహిళా క్లబ్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో క్లబ్ సెక్రటరీ లక్ష్మి, పరిశ్రమ అధికారులు, టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు శ్యామ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాపిరెడ్డి



కోదాడరూరల్ : కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన అన్నెం పాపిరెడ్డి ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో మూడు రోజులుగా జరిగిన రైతు సంఘం మహాసభలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. రైతు, కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

మోతె : రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని రేషన్ దుకాణాల్లో ఏప్రిల్ 1వ తేదీ వరకు 2,573.59 క్వింటాల సన్న బియ్యం అందుబాటులో ఉంటాయన్నారు. డీటీ లావణ్య, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

గరిడేపల్లి : అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని కీతవారిగూడెం, గరిడేపల్లి సెక్టార్ల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలను వారు సందర్శించి మాట్లాడారు. సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, ప్రతాని సైదులు, ఏఐటీయూసీ నాయకులు అంబటి వెంకటరెడ్డి, మాతంగి వెంకన్న, ప్రసాద్, ప్రేమానందం పాల్గొన్నారు.

నూతన డీఎంకు సన్మానం



డీఎంను సన్మానిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

కోదాడ : ఆర్టీసీలో అనేక సంవత్సరాలు సేవలందించి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తన పరిధిలోనివి అయితే వెంటనే పరిష్కరిస్తానని కోదాడ ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు తెలిపారు. కోదాడ డిపో నూతన మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను గురువారం రిటైర్డు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి. రేడియో, ఎం.ఉపేందర్, మీరా, వీ.ఎస్ .నాయక్, పి.వి.రావు, బేగ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలి

గరిడేపల్లి : రైతు సహకార సంఘంలో తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని మహాజన సభ సంఘం అఫీషియల్ పీఏసీ జదుపతి కమల అన్నారు. గురువారం మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం నుంచి మూడు శాతం వడ్డీ రైతుల ఖాతాలో జమ అవుతుందని, లేనిచో 13 శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, గోపయ్య, సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న రైతు వేదికలు

- రైతులకు అందని సూచనలు, సలహాలు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన రైతు వేదికలు
- రక్షణ లేక చోరీకి గురైన సామగ్రి



జానలదిన్నలోని రైతు వేదిక

నేరేడుచర్ల : మండల పరిధిలోని రైతు వేదికలు వెలవెలబోతున్నాయి. పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. కానీ ప్రస్తుతం రైతులకు ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించకపోవడంతో రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. అంతేకాకుండా రైతు వేదికలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రైతు వేదికల వద్ద సాయంత్రం వేళల్లో మందుబాబులు మద్యం సేవించి సీసాలు పగులగొట్టి వెళ్తున్నారు. ఇప్పటికే కొన్ని రైతు వేదికల తలుపులు, కిటికీలు, తాగు నీటి నల్లాలు ధ్వంసం చేశారు. నేరేడుచర్ల మండలంలో క్లస్టర్‌కు ఒకటి చొప్పున దిర్శించర్ల, చిల్లేపల్లి, కల్లూరు, జానలదిన్న గ్రామాల్లో ఒక్కో రైతు వేదికకు రూ.22.25 లక్షలు వెచ్చించి నిర్మించారు. రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహించకపోవడం, రైతులకు సంబంధించిన పుస్తకాలు, పత్రికలు, కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడంతో వేదికల వైపు కన్నెత్తి చూడటం లేదు.

రైతు వేదికలో సామగ్రి చోరీ..

జానలదిన్నలో రైతు వేదిక గ్రామానికి దూరంగా ఉండటంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. రైతు వేదిక తలుపులు విరగొట్టి 12 ఫ్యాన్లు, 8 ట్యూబ్ లైట్లు, 70 కుర్చీలు, విద్యుత్ మోటార్, వైరు, వాటర్ ట్యాంకు, మరుగుదొడ్ల డోర్లు అపహరించుకుపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతి రైతు వేదికకు ఒక అటెండర్‌ను నియమించాలని, రైతులకు కావాల్సిన ఏర్పాట్లు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

రైతు వేదికల్లో సౌకర్యాలు లేవు



జానలదిన్నలో నిర్మించిన రైతు వేదిక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనంలోని వస్తువులు చోరీకి గురయ్యాయి. అక్కడ కనీసం తాగు నీటి సౌకర్యం కూడా లేకపోవడంతోనే రైతులు సమావేశాలకు హాజరు కావడం లేదు. రైతులకు సాగుకు సంబంధించిన పుస్తకాలు, దిన పత్రికలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాలి. సౌకర్యాలు కల్పించాలి.

– కుసుమ రవీందర్‌రెడ్డి, రైతు, జానలదిన్న

ఉపయోగంలోకి తీసుకువస్తాం



మండలంలోని రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. రైతు వేదికల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, జానలదిన్న రైతు వేదికలో సామగ్రి చోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. రైతు వేదికల వద్ద రక్షణ ఏర్పాటు చేసి రైతుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తాం.

– జావేద్, మండల వ్యవసాయ అధికారి, నేరేడుచర్ల

ఒకే వేదికపై పెన్షనర్ల జన్మదిన వేడుకలు



పుట్టినరోజు జరుపుకుంటున్న పెన్షనర్లను సన్మానిస్తున్న కుటుంబసభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో ఏడుగురు పెన్షనర్ల జన్మదిన వేడుకలను సామూహికంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకున్న చావా వీరభద్రారావు, బొడ్డుపల్లి సుందరయ్య, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తడకమళ్ల శశికల, జయ సుందర్‌రావు, వెంపటి శ్రీనివాస్‌రావు, రూపావత్ మంగ్యాను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొణతం కృష్ణారెడ్డి, పెన్షనర్ల యూనియన్ కోశాధికారి బుద్ధారెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి సుందరయ్య, జిలకర రామస్వామి, కొప్పుల రంగారెడ్డి, రమణారావు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హుజూర్‌నగర్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం– 1 స్పెషల్ క్యాంపులో భాగంగా గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడి ఎంతో మంది నష్టపోతున్నారని తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు అవగాహన కల్పించి జాగ్రత్త పడే విధంగా చైతన్యపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నాగార్జున, బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



మునగాలలో మానవహారం నిర్వహిస్తున్న పాస్టర్లు

మునగాల : క్రైస్తవ బోధకుడు, ప్రపంచ వ్యాప్తంగా సువార్తకుడిగా పనిచేస్తున్న పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జె.సుదర్శనం కోరారు. గురువారం మునగాల మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సుదర్శనం మాట్లాడుతూ.. ప్రవీణ్ మృతి క్రైస్తవ లోకానికి తీరని లోటని అన్నారు. జిల్లా క్రైస్తవ మీడియా కన్వీనర్ జె.జె.సామ్యూల్‌సన్, మండల పాస్టర్స్ ఫెలోషిప్ మునగాల అధ్యక్ష, కార్యదర్శులు ఆదాము, సామ్యూల్ పీటర్, సామాజిక కార్యకర్త గంధం సైదులు, కోదాడ టౌన్ అధ్యక్షులు పి.పాల్ చారి, ఎల్.లాజర్, పాస్టర్లు డేవిడ్‌రాజు, జె.లుకా, వసంత్ ఒబద్య, ఎం.రాజేష్, జె.సామియేలు, అబ్రహం రాజు, రక్షకస్, విలియమ్స్, ఉదయ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని వర్తక సంఘం భవనంలో గురువారం క్రైస్తవుల ఆత్మీయ క్షేమాభివృద్ధి కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని పాస్టర్లు ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు

- పాల్గొననున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నేరేడుచర్ల పట్టణంలోని ఏ–1 ఫంక్షన్ హాల్‌లో నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి మండలాలకు చెందిన ముస్లింలకు ఈనెల 28వ తేదీన ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు నేరేడుచర్ల తహసీల్దార్ సురిగి సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ముస్లింలు పాల్గొనాలని కోరారు.

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు

నడిగూడెం : కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మండల నాయకులు బూరుగడ్డ థామస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ యువ వికాసం, పలు పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమని తెలిపారు. వాటి కోసం నడిగూడెం కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరిగినా పని కావడం లేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు అవసరం లేని ఆధారాలను అడుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సకాలంలో ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



చిలుకూరు : జానకీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అమ్మనాయక్



మేళ్లచెరువు : రేవూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు



మునగాల : కోదండరామాపురంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జైపాల్‌రెడ్డి

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమ్మనాయక్ ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లూరి భ్రమరాచారి, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్నావత్ పవన్, నాయకులు భట్టు సక్రు, పంతులు, కనకరావు, కరంచంద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ సహకారంతో అభివృద్ధి

మునగాల : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో మునగాల మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోదండరామాపురం గ్రామ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఉప్పుల జానకిరెడ్డి, కాలె సామియేలు, సుంకి లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిలి వెంకటరెడ్డి, సుంకి కృష్ణారెడ్డి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవూరులో..

మేళ్లచెరువు : మండలంలోని రేవూరు గ్రామంలో గల 10 వార్డులో జాతీయ ఉపాధి హామీ నిధులు సుమారు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ నాయకులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సాధం సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, మధు, రమేష్, భార్గవ్, గోవర్ధన్, ప్రసాదరావు, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో పూజలు

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం శివారులో గల సాయిమందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అనంతగిరి మాజీ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు –పద్మావతి దంపతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, అలసకాని శ్రీనివాసరావు, పూజారి సాయిశర్మ, ప్రగడ వెంకటేశ్వరరావు, బాలరాజు, శరభేశ్వరరావు ఉన్నారు.

విజయవంతం చేయాలి

నడిగూడెం : మండలంలోని రత్నవరం రైతు వేదికలో శుక్రవారం నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ కొల్లు రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పాలకవర్గంతో పాటు, సంఘంలో సభ్యులైన రైతులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మల్లూస్వర్ జీవితం స్ఫూర్తిదాయకం



స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోతె : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు ఇండ్ల మల్లూస్వర్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలో ఇండ్ల మల్లూస్వర్ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోసపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గుంటగాని ఏసు, చర్లపల్లి మల్లయ్య, ఎలుగు మధు, బానోతు వెంకన్న, వెంకన్న, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండలంలోని బేతవోలులో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున బేతవోలు, కొండాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటలో తెలిపారు.

ఇంటి పన్ను చెల్లించడం లేదని సిబ్బంది ధర్నా



నేరేడుచర్లలో బానోతు భీమా ఇంటి వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేరేడుచర్ల: ఇంటి పన్ను చెల్లించడం లేదని ఓ యజమాని ఇంటి ఎదుట మున్సిపల్ సిబ్బంది ధర్నాకు దిగారు. ఈ ఘటన నేరేడుచర్ల పట్టణంలోని మూడోవార్డులో గురువారం చోటుచేసుకుంది. నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మూడవ వార్డులో నివాసం ఉంటున్న బానోతు భీమా 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను మొత్తం రూ.30,542 చెల్లించాల్సి ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది రోజూ ఇంటి పన్ను వసూళ్లకు వెళితే రహదారి, డ్రెయినేజీ సౌకర్యం లేదని, ఏదో ఒక సాగు చెబుతూ పన్ను చెల్లించడం వాయిదా వేస్తున్నారన్నారు. ఇటీవల ఒత్తిడి చేయగా రూ.3వేలు మాత్రమే చెల్లించారన్నారు. ప్రభుత్వం పన్ను వడ్డీపై 90 శాతం రాయితీని అవకాశం కల్పించినప్పటికీ స్పందించడం లేదన్నారు. దీంతో రెడ్ నోటీసు జారీ చేశామని, నీటి సరఫరాను బంద్ చేసి, డ్రెయినేజీని మూసి వేసి ధర్నాను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యాకుబ్‌అలీ, వార్డు అధికారులు, ఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సేవలు అభినందనీయం



డీఎస్పీని సన్మానిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

కోదాడరూరల్ : కోదాడ రిటైర్డు ఉద్యోగులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలో పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన రిటైర్డు ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ పట్టణంలో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి రిటైర్డు ఉద్యోగుల క్రీడా పోటీలు నిర్వహించడం గర్వించదగిన విషయమన్నారు. పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసి పదవీ విరమణ అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారిని సన్మానించారు. అనంతరం డీఎస్పీని రిటైర్డు ఉద్యోగులు సన్మానించారు. అదే విధంగా మార్చి నెలలో జరుపుకునే రిటైర్డు ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని రంగారావు, బొల్లు రాంబాబు, సోమయ్య, రఘువర ప్రసాద్, శోభ, భ్రమరాంబ ఉన్నారు.

రోడ్డుపై రోడ్డేసి.. మట్టిదారులను వదిలేసి



రోడ్డుపై సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

చిలుకూరు : సాధారణంగా గ్రామాల్లో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తారు.. కానీ చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామంలో మాత్రం రోడ్డు అవసరమున్న బజారులను వదిలేసి ఎస్సీ బజారులో గురువారం పాత సీసీ రోడ్డుపై మళ్లీ సీసీ రోడ్డు వేశారు. 2013లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కింద సుమారు రూ. 3 లక్షలతో ఈ బజారులో సీసీ రోడ్డు నిర్మించారు. సాధారణంగా సీసీ రోడ్డు కనీసం 20 ఏళ్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం కూడా రోడ్డు ధ్వంసం కాకుండా ఉంది. కానీ సీతారాపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ. 6 లక్షల నిధులు మంజూరు కావడంతో అందులో సుమారు రూ. 4 లక్షలు కేటాయించి సీసీ రోడ్డుపై మళ్లీ సీసీ రోడ్డు వేశా రు. ఈ విషయం ఇప్పుడు గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. రోడ్డు ఉన్న చోట మళ్లీ రోడ్డు వేయడంపై గ్రామస్తులు కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ప్రజా ధనం దుర్వినియోగం అవుతున్నా ఎవరూ పట్టించుకోవ డం లేదని ఆరోపిస్తున్నారు. పైగా సీసీ రోడ్డు నిర్మాణంలో కూడా కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణా లు పా టించడం లేదని అంటున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

విశ్వావసు నామ పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ భాస్కర్, అర్చకులు

చిలుకూరు : అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ భాస్కర్ అన్నారు. చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో గల కనకదుర్గమ్మ దేవాలయం ఆవరణలో దూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన విశ్వావసు నామ పంచాంగాన్ని అర్చకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చకులకు కనీసం వేతనం, ఉద్యోగ భద్రత కల్పించేందుకు పాటుపడతానని తెలిపారు. దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ, జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్ శర్మ, పంచాంగకర్త వీరబద్ర దైవజ్ఞ, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు రామలింగేశ్వరశర్మ, లక్ష్మీరమణమూర్తి, రామయ్యశర్మ, ప్రసాద్‌శర్మ, దివాకర్‌శర్మ, ప్రణయ్‌కుమార్, సీతారామారావు, సాయికిరణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



సాయి మందిరంలో అన్నదానం నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి దంపతులు



వృద్ధాశ్రమంలో ..

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం నడిగూడెం మండల కేంద్రానికి చెందిన మన్నెం నిరంజన్‌రెడ్డి –అరుణ దంపతుల కుమార్తె మాధురి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అన్నదానం నిర్వహించడం పుణ్యకార్యమని అన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

షిర్డీసాయి మందిరంలో..

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో ఉన్న షిర్డీసాయి మందిరంలో గురువారం మండల కేంద్రానికి చెందిన బొబ్బిలి శ్రీనివాసరెడ్డి –వనజ దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. పూజారి చింతోజు వెంకటేశ్వర్లు మందిరంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర నిర్వాహకులు దేవినేని రవికుమార్, అయ్యప్ప ఆలయ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి, గ్రామపెద్దలు వెంకటచలపతి, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు దేవరంగుల యల్లయ్య (38) మృతి చెందాడు. గురువారం ఆయన మృతదేహాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. యల్లయ్య కుటుంబానికి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు తిరుమలేష్, వల్లెపు శ్రీనివాస్, ఒగ్గు సైదులు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

పాలకవీడు : మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు లేవు. దీంతో పాలకవీడు నుంచి నేరేడుచర్ల, జాన్‌పహాడ్ వెళ్లే రోడ్డులో మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుడుగుంట్లపాలెంలోని మూలమలుపులో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై పడడంతో ప్రమాదంలో గాయపడిన వ్యక్తి నేటికీ మంచానికే పరిమితమయ్యాడు. పాలకవీడులో ఇటీవల మూలమలుపు వద్ద లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు చనిపోయాయి. అక్కడే ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పాలకవీడు శివారులో పెట్రోల్ బంక్ వద్ద మూలమలుపులో ఇసుక ట్రాక్టర్, వరి కోత మిషన్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇలా మూలమలుపుల్లో నిత్యం ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని సంబంధిత అధికారులు స్పందించి మలుపుల్లో సూచిక బోర్డులు పెట్టాలని, మూల మలుపుల్లో రోడ్లను విస్తరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జాన్‌పహాడ్ నుంచి మఠంపల్లి వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



హనుమయ్యగూడెం వద్ద..